క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన నాయకులతో శ్రీహరిరావు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని తన నివాసంలో కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో లక్ష్మణచాంద మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఓడ్నాల రాజేశ్వర్, చింతల్‌చాంద గ్రామ మాజీ సర్పంచ్, పృథ్వీరాజ్, ఒడ్ల శ్రీనివాస్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. నిర్మల్ ప్రియదర్శిని నగర్‌కు చెందిన మార నరసింహారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముధోల్: మండలంలోని చించాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సాయిగణేశ్ పాలిసెట్‌లో ప్రతిభ కనబరిచి హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్ కళాశాలలో ప్రవేశం పొందాడు. కాగా బుధవారం ఉపాధ్యాయులు గణేశ్‌ను సన్మానించి రూ.5వేల సాయం అందించారు. సర్పంచ్ సంగీత మారీబా, ప్రధానోపాధ్యాయుడు నాగేందర్, గంగాధర్, ఉపాధ్యాయుడు ప్రభాకర్, రాజశేఖర్‌చారి, అనిల్‌కుమార్, బసవరాజు, కవిత, వనజ, భోజాబాయి ఉన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: లక్ష్మణచాంద మండలం ధర్మారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు భూషణం మల్లేష్, తుర్తి రాజేశ్వర్‌తోపాటు పలువురు నాయకులు నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు బీజేపీలో చేరారు. మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

29న బీఎస్‌ఐ కార్యవర్గ సమావేశం

భైంసాటౌన్: హైదరాబాద్‌లో ఈనెల 29న జరిగే తెలంగాణ రాష్ట్ర భారతీయ బౌద్ధ మహాసభ కార్యవర్గ సమావేశం జయప్రదం చేయాలని బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ పిలుపునిచ్చారు. భైంసాలోని బుద్ధవిహార్‌లో బుధవారం నిర్వహించిన చింతన్‌బైటక్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, కెర్బా, విశ్వంబర్, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కడెం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. బుధవారం ఒంటి కాలుపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఖానాపూర్: పంచాయతీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత నాస్తిక సమాజం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బొమ్మెన రాజ్‌కుమార్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష 14వరోజుకు చేరింది. కార్యక్రమంలో చంద్రశేఖర్, నాగరాజు, స్వామి, పోశెట్టి తదితరులు ఉన్నారు.

చైతన్యయాత్రకు తరలిరండి

కడెం: ఈనెల 23న ఇంద్రవెల్లి నుంచి ప్రారంభమయ్యే నేతకాని మహార్ సమన్వయ కమిటీ రాజకీయ చైతన్యయాత్రకు నేతకాని కులస్తులు తరలిరావాలని ఆ కమిటీ రాష్ట్ర నాయకులు దుర్గె వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కొత్తమద్దిపడగలో యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. నేతకానిలు ఐక్యతను చాటేలా ఇంద్రవెల్లి, ఉట్నూర్ మీదుగా జన్నారం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. భీమన్న, మల్లయ్య, గంగన్న, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

నేత్ర చికిత్స కేంద్రం ప్రారంభం

సారంగపూర్: ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్య చికిత్స కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు శ్రీహరిరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎల్‌విప్రసాద్ వైద్యవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శ్రీహరిరావు కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన కేంద్రం ప్రారంభించారు. నేత్ర సమస్యలున్నవారు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ కేంద్రం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కూచాడి అర్పిత, పలువురు వైద్యసిబ్బంది ఉన్నారు.

వరినాట్లకు కూలీలు దొరకట్లే..!

- ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్న స్థానిక రైతులు
- అడ్వాన్స్‌లు చెల్లించి వేచిచూస్తున్న వైనం
- వలస కూలీలకు ఫుల్ డిమాండ్



వట్టోలిలో పొలం దున్నుతున్న రైతు



ధర్మోరలో వరినాట్లు వేస్తున్న బిహార్ కూలీలు

లోకేశ్వరం: ప్రస్తుత సీజన్‌లో వరినాట్లు ఊపందుకోవడంతో రైతులను కూలీల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసేవారి సంఖ్య పెరిగింది. లోకేశ్వరం మండలంలో చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకం, బోరుబావుల వద్ద ఏకకాలంలో నాట్లు వేస్తుండటంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు కూలీలకు వారం, పది రోజుల ముందే అడ్వాన్సు చెల్లించి వారి కోసం వేచి చూస్తున్నారు.

పెరిగిన కూలీ రేట్లు ..

గతేడాదితో పోలిస్తే ఈసారి కూలీరేట్లు పెరిగాయి. ఎకరా పొలం నాటు వేసేందుకు 10 నుంచి 12 మంది ఆడకూలీలు అవసరమవుతారు. గతేడాది నాటు వేసేందుకు రూ.400 తీసుకున్న కూలీలు ఈసారి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. అలాగే పురుషులకు రూ.600 నుంచి రూ.700 వరకు కూలీ చెల్లిస్తున్నారు. ఇప్పటికే మండలంలో యాభై శాతం వరినాట్లు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు.

స్థానికులు అటు.. వలస కూలీలు ఇటు

మండలంలోని ఆయా గ్రామాల్లో కూలీలు నాటు వేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో మండల రైతులు ఇతర ప్రాంతాల్లో నుంచి వలస కూలీలను ఆటోల్లో తీసుకొచ్చి నాట్లు వేయించుకుంటున్నారు. మరోవైపు స్థానిక కూలీలు నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని సీహెచ్ కొండూర్, నాలేశ్వర్, ఉమ్మెడ, భాద్గుణ, అన్నారం, నందిపేట్, తల్వేద, ఆయిలాపూర్, కొత్తూర్, సీమ్‌రాజ్‌పల్లి గ్రామాలకు నాట్లు వేసేందుకు వెళ్తున్నారు. దీంతో రైతులు అడ్వాన్సులు చెల్లించి కూలీల రాక కోసం ఎదురుచూస్తున్నారు.

ఎకరాకు రూ.5,200

కొన్ని చోట్ల బిహార్ వలస కూలీలు, నల్గొండ, మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం లోకేశ్వరం మండలం గడ్‌చాందలో నల్గొండ కూలీలు, పుస్పూర్‌లో మహారాష్ట్ర కూలీలు వరినాట్లు వేసేందుకు వచ్చారు. 12మంది గ్రూపుగా ఏర్పడి ఎకరం పొలం నాటు వేసేందుకు గుత్తకు రూ.5200 తీసుకుంటున్నారు. పీకిన నారు పొలంలో పంచేందుకు, యూరియా చల్లేందుకు అదనంగా వసూలు చేస్తారు.

కూలీల కొరత ఉంది



వరినాట్లు వేసేందుకు స్థానికంగా కూలీల కొరత అధికంగా ఉంది. ఎక్కువ డబ్బులు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదు. పది రోజుల ముందు అడ్వాన్స్ ఇచ్చి కూలీల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసారి నాట్లు అలస్యమయ్యేలా ఉన్నాయి.

– రాజేశ్వర్, వట్టోలి

అన్ని పనులు చేసుకుంటున్నారు



స్థానికంగా కూలీల కొరత ఉండడంతో ఇతర ప్రాంతాల వారు వచ్చి ఇక్కడ నాట్లు వేస్తున్నారు. నారు పొలంలో పరువడం నుంచి నాటే వేసే వరకు అన్ని పనులు వారు చేసుకుంటున్నారు. కాకపోతే వారికి ముందే అడ్వాన్సు చెల్లించాలి.

– అసీబొద్దీన్ పటేల్, ధర్మోర

గిట్టుబాటు కాకనే వేరే ఊరికి..



మా గ్రామంలో పొలం నాటు వేసేందుకు కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఇతర మండలాలకు నాటు వేయడానికి వెళితే రోజుకు రూ.800 నుంచి రూ.900 వరకు వస్తుంది. అక్కడి రైతులు పొలం వద్దనే కూలీలకు డబ్బులు చెల్లిస్తారు.

– ఆకుల లక్ష్మి, ధర్మోర

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



కలెక్టరేట్‌లో బ్యానర్ ప్రదర్శిస్తున్న వరుణ్‌రెడ్డి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు



మంజులాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



ఖానాపూర్: బాదనకుర్తిలో విద్యార్థుల ర్యాలీ



భైంసాలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మామడ: జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్ల లోపున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో నులిపురుగుల నివారణ కార్యక్రమం బ్యానర్ ప్రదర్శించారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పిల్లలందరూ మాత్రలు వేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి ధన్‌రాజ్, నిర్వహణ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

మామడ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 19ఏళ్లలోపు వారంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు.

భైంసాటౌన్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అర్బన్ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని కుంట ప్రాంతంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ నులిపురుగులతో కలిగే పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక, మానసిక పెరుగుదలపై ప్రభావం, తదితర అంశాలు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్యకేంద్రాల్లో ఈ మాత్రలు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. హెచ్‌ఈవో కలీమొద్దీన్, మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో జాతీయ నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వీధుల గుండా తిరుగుతూ ఇంటింటికి వెళ్లి నులిపురుగుల నివారణ గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు సరిత, అంబాజీ, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఆరోగ్యవంతమైన సమాజం మనందరి బాధ్యత అని ఎంపీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండలంలోని బాదనకుర్తిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాదనకుర్తి సబ్‌సెంటర్ సీహెచ్‌వో మనీష మాట్లాడారు. అంతకముందు పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీహెచ్‌వో మీరాబాయ్, హెచ్‌వీ సుజాత, హెచ్‌ఈ జయలలిత, హెచ్‌ఎం రమేశ్, కార్యదర్శి సురేందర్, సిబ్బంది ఉన్నారు.

ముధోల్: నులిపురుగుల నివారణకు గురువారం ఒకటి నుంచి పందొమ్మిదేళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీల్లో, కాలేజీల్లో నులిపురుగుల మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు తొలి విడత బీసీ చెక్కుల పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు అందించే రూ.లక్ష ఆర్థికసాయం మొదటి విడత చెక్కుల పంపిణీ గురువారం ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు అందించనున్నారు. చెక్కుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దని.. విడతలవారీగా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రభుత్వం పేర్కొంది.

తొలి విడత 50 మందికే...

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తొలి విడత నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారుల లక్ష ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ లెక్కన 900 మందికి తొలివిడత సాయం అందించేందుకు రూ.9 కోట్ల అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న పాత బడ్జెట్ రూ.1.5 కోట్లను పంపిణీ చేస్తే కేవలం 150 మందికి సరిపోతుంది. అంటే నియోజకవర్గానికి 50 మందికి మాత్రమే రూ.లక్ష సాయం అందించేందుకు వీలవుతుంది. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. అందుకే విడతల వారీగా చెక్కుల పంపిణీ ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

జూదరుల అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ఎల్. శ్రీను తెలిపారు. బుధవారం రాత్రి పట్టణానికే చెందిన మొహమ్మద్ ముబీన్, సయీద్ ఖలీల్ మట్కా ఆడుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.1080 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పేకాట, మట్కా వంటి కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

తానూరు: మండల కేంద్రంలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కృపారాణి మాట్లాడుతూ అన్నం తినే ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుభాశ్ మోస్లే, ఆశావర్కర్లు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో రైతు సేవా సహకార సంఘం(ఎఫ్‌ఎస్‌సీఎస్) అధికారులు బుధవారం రైతుల ఇళ్లకు వెళ్లి వారి రుణాలు రెన్యూవల్ చేశారు. సకాలంలో వడ్డీ చెల్లించిన వారికి మూడు శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ తోట సాయన్న, సిబ్బంది శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

పరామర్శ

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గి గ్రామానికి చెందిన ఐకేపీ సీసీ శ్రీనివాస్ కూతురు సుష్మిక రోడ్డు ప్రమాదంలో మరణించగా బాధిత కుటుంబాన్ని బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. వారి వెంట మౌలానా, రమేశ్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ అయ్యప్ప స్వామి సన్నిధానంలో భక్తులు బుధవారం మొక్కలు నాటారు. గురుస్వామి హరిప్రసాద్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటినట్లు భక్తులు పేర్కొన్నారు. ఏపీవో గట్టుపెల్లి నవీన్, నవీన్, రజినీకాంత్, గోపి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా వివరాలు నమోదు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో పలువురు రైతులు రైతుబీమా నమోదు చేసుకున్నారు. బుధవారం మండలంలోని ధర్మారంలో పీచర క్లస్టర్ ఏఈవో పవిత్ర గ్రామంలో రైతుబీమాకు అర్హులైన వారి వివరాలను ఏఈవో పవిత్ర సేకరించారు. రైతుల నూతన పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ వివరాలు సేకరించారు. ఇందులో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ టీవీ అందజేత

మామడ: మండలంలోని అనంతపేట్ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని బుధవారం విరాళంగా అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు తిరుమల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించండి

ఖానాపూర్: పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రెడ్డికి విన్నవించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్మన్ విజయలక్ష్మి నివాసంలో ఆమె భర్త రాంకిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ మాట్లాడారు. 17 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్మికులకు 30 శాతం పీఆర్సీ అమలు చేయాలన్నారు. చనిపోయిన స్వీపర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం నాయకులు సత్తన్న, సయ్యద్ బాబు, గంగాధర్, నర్సయ్య, పోశాని తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్

నిర్మల్‌రూరల్: జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా మెస్ చార్జీలు పెంచిన కేసీఆర్ విద్యాసంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా జీవోలను విడుదల చేయలేదన్నారు. అంతేకాక మెనూ నుంచి పాలు, పెరుగు తగ్గించడం బాధాకరమన్నారు. వర్షం కురిస్తే ఇబ్బంది అవుతుందని.. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే సంఘం తరఫున ఆందోళనలు చేస్తామన్నారు. దిగంబర్, నవీన్, రాజేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

‘రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఇక్కట్లు’



సదర్మాట్ వద్ద పరిశీలిస్తున్న జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. బుధవారం పట్టణంలోని 139వ బూత్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన టిఫిన్ బైటక్ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, గోపాల్‌రెడ్డి, తిరుమలగిరి, నల్లూరి శ్రీధర్, ఉపేందర్, శ్రావణ్, నరేందర్, రమేశ్, రవి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సదర్మాట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

ఖానాపూర్ మండలం మేడంపల్లిలో సదర్మాట్ వద్ద బాలుడు మృతి చెందిన ఘటనా స్థలాన్ని పెంబి జెడ్పీటీసీ జానుబాయి పరిశీలించారు. ప్రభుత్వం ప్రమాదాలు జరగకుండా వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఈవీఎంలపై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో ఈవీఎంలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కవితారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న బోరిగాం, నర్సాపూర్ గ్రామాల్లో, 21న బాబాపూర్, న్యూకంజర్‌లో, 22న లక్ష్మణచాందలో, 24న చామన్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో 25న మునిపెల్లి, మాచాపూర్‌లో 26న మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో 27న ధర్మారం, పీచర, 28న పొట్టపెల్లి, రాచాపూర్‌లో, 31న వడ్యాల్ తండా, వడ్యాల్‌లో, వచ్చే నెల 1న తిర్పెల్లి, కనకాపూర్‌లో ఈవీఎంలపై నాయబ్ తహసీల్దార్ గంగాధర్ అవగాహన కల్పిస్తారని ఆమె తెలిపారు.

విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీవీలు

భైంసారూరల్: విద్యావలంటీర్లను రెన్యూవల్ చేయాలని కోరుతూ తెలంగాణ విద్యావలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని దేగాంలో గ్రామంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దిగంబర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్లుగా బోధన సిబ్బందిగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కరోనా తర్వాత తమను రెన్యూవల్ చేయకపోగా పెండింగ్ వేతనాలు సైతం ఇవ్వలేదని వాపోయారు. తమను రెన్యూవల్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్సైలు

బాసర ఎస్సైగా గణేశ్



మొక్క నాటుతున్న ఎస్సై గణేశ్

భైంసా: బాసర నూతన ఎస్సైగా గణేశ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైని పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అవరణలో ఎస్సై మొక్కలు నాటారు.

భైంసారూరల్ ఎస్సైగా శ్రీకాంత్



భైంసారూరల్: భైంసారూరల్ ఎస్సైగా కె.శ్రీకాంత్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి ఎస్సైగా పని చేశారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎస్.శ్రీకాంత్ నిర్మల్‌టౌన్ ఎస్సైగా బదిలీ అయ్యారు. నూతన ఎస్సైకి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

లక్ష్మణచాంద ఎస్సైగా శ్రీకాంత్



లక్ష్మణచాంద: లక్ష్మణచాంద నూతన ఎస్సైగా సల్ల శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన రాహుల్ గైక్వాడ్ తానూర్‌కు బదిలీపై వెళ్లగా నందిపేట్ ఎస్సై శ్రీకాంత్ లక్ష్మణచాందకు వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన ఎస్సైకి సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు.

తానూరు ఎస్సైగా జి.రాహుల్



తానూరు: తానూరు ఎస్సైగా జి రాహుల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్సై వి క్రమ్ బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లగా.. లక్ష్మణ్‌చాంద ఎస్సై రాహుల్ తానూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైకి సిబ్బంది స్వాగతం పలికారు.

ఆపదలో 100కు డయల్ చేయండి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

ఖానాపూర్: మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీటీం ఎస్సై ఆర్.శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే కళాశాలలో షీటీం సేవలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్‌మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1930ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌తో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అంతకుముందు మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో షీటీం ఎస్సై సుమాంజలి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, సృజన, లింగయ్య, రమాదేవి, తదితరులు ఉన్నారు.

గుంతలు తవ్వి మొక్కలు నాటాలి

లోకేశ్వరం: గ్రామాల్లో గుంతలు తవ్వి హరితహారం మొక్కలు నాటాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్లపై నీరు నిల్వకుండా చూసి..ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ తదితరులు ఉన్నారు.